APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ సోమవారం 14 సెప్టెంబరు 2026 సంపుటి: 01 సంచిక :110 పేజీలు : 04 వెల: 2-00/-

## ఏపీకి 'అల్పపీడనం' ముప్పు - నేడు ఆ జిల్లాల్లో భారీ వర్షాలు! - అప్రమత్తమైన ప్రభుత్వం



అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.

అత్యధికంగా 79.1, అత్యల్పంగా 32.5 మి.మీ వర్షపాతం నమోదవుతుంది.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

అమరావతి : ఎల్‌నినో ప్రభావంతో ముఖం చాటేసిన వరుణుడు కరుణిస్తుండటంతో ప్రజలు, రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. శనివారం సాయంత్రం రాష్ట్రంలో అనేత ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. మరోవైపు అల్పపీడన ప్రభావంతో ఇవాళ ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని, 24 గంటల్లో ఇది విదర్భ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అల్పపీడన ప్రభావంతో నేడు(ఆదివారం) ఉత్తరాంధ్ర జిల్లాల్లో మిగతా..2లో

## హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్.. 292 మందిపై కేసులు




వీకెండ్ వచ్చిందంటే చాలు.. పార్టీలు, పబ్బులతో ఎంజాయ్ చేసి రోడ్లపైకి వస్తున్న మందుబాబులకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు షాకిచ్చారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారిని టార్గెట్ చేస్తూ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏకంగా 292 మంది పోలీసులకు చిక్కారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 13: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన వీకెండ్ స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 292 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 240 మంది బైకర్లు, 12 మంది ఆటో డ్రైవర్లు, 40 మంది కారు డ్రైవర్లు ఉన్నారు. అధిక మోతాదులో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. 14 మంది వాహనదారులకు 301 నుంచి మిగతా..2లో

## ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్న సిబ్బందికి డిప్యూటీ సీఎం పవన్ అభినందనలు


2

- ఆపరేషన్ అరణ్యలో ప్రాణాలకు తెగించి ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్న అటవీ శాఖ సిబ్బందిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు.
- ఈ ఘటనలో స్మగ్లర్ల దాడిలో గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

అమరావతి, సెప్టెంబర్13: ఆపరేషన్ అరణ్యలో ప్రాణాలకు తెగించి ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్న అటవీ శాఖ సిబ్బందిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. ఈ ఘటనలో స్మగ్లర్ల దాడిలో గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అటవీ సిబ్బందిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## దేశంలోనే తొలిసారిగా అమరావతిలో

# 'క్వాంటమ్ బయో వ్యాలీ'

### ప్రకటించిన సీఎం చంద్రబాబు

- ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్రమంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.
- శనివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నడ్డాను సీఎం సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో సత్కరించి శ్రీవారి ప్రసాదం అందజేశారు.




అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నడ్డాకు సీఎం చంద్రబాబు సాదర స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి, మిగతా..2లో

## కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్


2లో

- డీఎస్సీ పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపణలు
- 65 మార్కుల నుంచి 77 మార్కులకు మారిన వైనంపై సందేహాలు
- అర్హత లేని టెట్ పేపర్‌తో ఉద్యోగం ఇచ్చారని విమర్శ
- ఈ స్కాంపై చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్

అమరావతి : టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కాం జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపిస్తుండడం తెలిసిందే. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా మరోసారి ధ్వజమెత్తారు.

## బ్రిక్స్ పగ్గాలు చైనాకు- ఇకపై ఫలితాలు

# చూపించాల్సిందే'

### బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ

- దిల్లీ డిక్లరేషన్‌ను కాలపరిమితితో అమలు చేయాలని బ్రిక్స్ దేశాలకు మోదీ సూచన
- బ్రిక్స్ ఇక కేవలం దేశాల కూటమి కాదని, పరిష్కారాల వ్యవస్థ అన్న ప్రధాని




ఢిల్లీ: బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. మిగతా..2లో

## బ్రిక్స్‌లో కొత్త బీమా వ్యవస్థ పుతిన్ కీలక ప్రతిపాదన


2లో..

- ధాన్యం మార్కెట్ కోసం సంయుక్త వ్యవస్థ పైనా రష్యా ప్రతిపాదన
- పాశ్చాత్య దేశాల ఆంక్షలతో రష్యా చమురు ఎగుమతులపై బీమా సమస్యలు
- మోదీపుతిన్ భేటీలో వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సాంకేతికతపై చర్చ

## భారత్ పై దాడి చేయాలనే ఆలోచన వస్తే శత్రువుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రధాని మోదీ చేశారు

- 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో ముందుంటుందనే విశ్వాసాన్ని మోదీ ప్రజలకు కలిగించారన్న షా
- మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని స్పష్టం
- డీకాలనైజేషన్ అంటే సత్యాన్ని ప్రామాణికంగా చూపడమేనని వ్యాఖ్య



2లో

ఢిల్లీ : గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు పాకిస్థాన్ భూభాగంలోకి చొరబడి మరీ సమాధానం చెప్పే ప్రధాని భారత్‌కు ఉంటారని ఎవరూ ఊహించలేదని అమిత్ షా అన్నారు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ లేదా 'ఆపరేషన్ సిందూర్', ఇలా ఏది తీసుకున్నా, భారత్‌పై దాడి చేయాలనే ఆలోచన చేయడానికి కూడా శత్రువులు వెన్నులో భయం పుట్టేలా చేసే రక్షణ విధానాన్ని నరేంద్ర మోదీ రూపొందించారని అన్నారు. రామ జన్మభూమి ఆలయ నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్, కేదార్‌నాథ్ పునరుద్ధరణ లేదా 'మహాకాల్ లోక్' నిర్మాణం వంటివి, ఏళ్ల తరబడి ఎవరూ మాట్లాడటానికి కూడా సాహసించని ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని చెప్పారు. మోదీ నాయకత్వంలో దేశంలోని అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకువచ్చారని, 2047 నాటికి దేశం అన్ని రంగాల్లో అన్ని దేశాల కంటే ముందుంటుందనే బలమైన విశ్వాసాన్ని ప్రజలకు కలిగించారని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు.

## మట్టి వినాయకుడిని పూజించాలి


2

- మట్టి వినాయకుడిని పూజించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు.
- ఆనాడు పార్వతీదేవి నలుగు మట్టితోనే వినాయకుడిని తయారుచేసిందని వెల్లడించారు.
- ప్రతి ఊరికి మట్టి వినాయకుల విగ్రహాలను పెడతామని చెబితే పర్మినెంట్ ఏర్పాటు చేయిస్తానని

సిద్దిపేట జిల్లా, సెప్టెంబర్ 13 : మట్టి వినాయకుడిని పూజించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో (ఆదివారం) అమర్నాథ్ అన్నదాత సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు.

## రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు

# మిగులు బడ్జెట్ వచ్చింది

- హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.
- ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామన్నారు.



హైదరాబాద్: ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారన్న సీఎం రేవంత్ రెడ్డి పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారని స్పష్టం చేసారు. ఆయన ఇవాళ హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నముఖ్యమంత్రి ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్ ఉంటుందని రోశయ్య ఆనాడే సలహా ఇచ్చారు : ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఆర్యవైశ్య సోదరులు పేదలకు ఉదారంగా అప్పు ఇస్తారని, తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని మాజీ సీఎం రోశయ్య గుర్తించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతుంటే ఆవేశం తగ్గించుకోవాలని చెప్పారని, ఆవేశానికి ఆలోచన తోడయితే భవిష్యత్ ఉంటుందని రోశయ్య సలహా ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు కానీ దూషించరని కొనియాడారు. మిగతా..2లో

## స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి



- తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నానన్న ప్రచారాన్ని కొట్టిపారేసిన కొండా సురేఖ
- మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది
- భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు
- త్వరలో తన భర్త కొండా మురళికి పదవి వస్తుందన్న సంకేతాలు ఉన్నాయని వెల్లడి

హైదరాబాద్: తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్

ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. విమర్శలు వెల్లువెత్తిన తర్వాత, ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే, డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్‌కు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్--దీలో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు. 2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే, ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా? అని ప్రశ్నిస్తూ, దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

## ధాన్యం మార్కెట్‌పైనా ప్రతిపాదన

బీమా వ్యవస్థతో పాటు బ్రిక్స్ దేశాల కోసం ప్రత్యేకంగా ధాన్యం మార్కెట్ ఏర్పాటు చేయాలని కూడా రష్యా ప్రతిపాదించింది. ఆహార భద్రత విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని పెంచే అవకాశం దీనివల్ల ఉంటుంది. ప్రపంచ ఆహార సరఫరా వ్యవస్థలో మార్పులు వస్తున్న సమయంలో ఈ ప్రతిపాదన కూడా ప్రాధాన్యం పొందింది. ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సమస్యలను కేవలం వాటి లక్షణాలను పరిష్కరించడం ద్వారా కాకుండా, అసలు కారణాలను గుర్తించి సమగ్రంగా ఎదుర్కోవాలని పుతిన్ అన్నారు. సంప్రదాయ, కొత్త తరహా భద్రతా సవాళ్లను కూడా కలిసి ఎదుర్కోవాలని గ్లోబల్ సౌత్ దేశాలకు పిలుపునిచ్చారు.

### బ్రిక్స్‌పై పెరుగుతున్న ఆసక్తి

బ్రిక్స్‌పై ప్రపంచ దేశాల ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని పుతిన్ చెప్పారు. స్వతంత్రంగా ముందుకు సాగడం, సమస్యలను కలిసి పరిష్కరించుకోవడం, అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమితి చార్టర్ సూత్రాలకు కట్టుబడి ఉండటం వంటి అంశాలు అనేక దేశాలకు ఆకర్షణీయంగా మారుతున్నాయని అన్నారు. బ్రిక్స్‌లో పూర్తి సభ్య దేశాలతో పాటు భాగస్వామ్య దేశాలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నాయి. ఈ విధానం ద్వారా సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు, ఇతర దేశాలు, అంతర్జాతీయ సంస్థల మధ్య నేరుగా చర్చలకు అవకాశం ఏర్పడుతుందని పుతిన్ పేర్కొన్నారు.

### మోదీ- పుతిన్ భేటీ

బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ ద్వైపాక్షిక సమావేశం కూడా నిర్వహించారు. భారత్- రష్యా మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు చర్చించారు. 2030 నాటికి ఆర్థిక సహకార కార్యక్రమాన్ని అమలు చేయడం, మౌలిక వసతులు, ఇంధనం, సాంకేతికత, రక్షణ, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని పెంచడంపై మాట్లాడారు పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతాల్లో కొనసాగుతున్న పరిణామాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఈ పరిణామాల ప్రభావం సముద్ర వాణిజ్యం, భారతీయ నావికుల భద్రతపై పడుతోందని భారత విదేశాంగ శాఖ తెలిపింది. వివాదాలకు చర్చలు, దౌత్యమే పరిష్కార మార్గాలని మోదీ మరోసారి స్పష్టం చేశారు. శాంతి ప్రయత్నాలకు భారత్ తన వంతు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఇక బ్రిక్స్ సదస్సు ముగిసిన అనంతరం పుతిన్ దిల్లీ నుంచి బయలుదేరారు. రెండు రోజుల సదస్సులో ఆయన పలు సమావేశాల్లో పాల్గొన్నారు. బ్రిక్స్ దేశాలు ఆర్థికంగా మరింత బలపడటంతో పాటు ప్రపంచ సమస్యలపై తమదైన విధానంతో ముందుకు వెళ్లాలన్న రష్యా ఆలోచనను ఆయన తాజా ప్రతిపాదనలు స్పష్టం చేశాయి.

## ఎర్రచందనం స్మగ్లర్లను పట్టుకున్న సిబ్బందికి డిప్యూటీ సీఎం పవన్ అభినందనలు

విధి నిర్వహణలో గాయపడిన సిబ్బందికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను ఏమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. అటవీ సంపదను దోచుకునే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో అటవీ సిబ్బంది గాయపడడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. అటవీ నేరాల నియంత్రణ విషయంలో కూటమి ప్రభుత్వం దృఢంగా వ్యవహరిస్తుందని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా రొంపిచెర్ల మండలం బొమ్మాయిగారి పల్లి గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు 'ఆపరేషన్ అరణ్య' చేపట్టారు. ఈ క్రమంలో ఎర్రచందనం స్మగ్లర్లతో వెళ్తున్న వాహనాన్ని అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారిపై స్మగ్లర్లు దాడి చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది గాయపడ్డారు. అయినా.. ఇద్దరు స్మగ్లర్లను పట్టుకున్నారు. అలాగే ఎర్రచందనం దుంగలు, తూకం యంత్రం, రంపం బ్లేడ్, గొడ్డళ్లతోపాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె. ప్రకాష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పి. రెడ్డి ప్రసాద్, కె. ప్రతాప్‌తోపాటు వాహనం డ్రైవర్ చరణ్‌కు గాయాలయాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పోస్ట్ చేశారు.


## హైదరాబాద్‌లో డ్రంకెన్ డ్రైవ్.. 292 మందిపై కేసులు

550 మధ్య బీఏసీ పాయింట్లు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన 292 మందిని చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్ కారణంగా ప్రమాదం జరిగి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగితే.. బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేరానికి గరిష్టంగా 10 ఏళ్ల వరకూ జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత వారం డ్రంకెన్ డ్రైవింగ్‌కు సంబంధించిన 681 కేసులను కోర్టులు పరిష్కరించగా, 18 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించారు. మరో ఏడుగురికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్ శిక్ష విధించగా, మిగిలిన 656 మందికి జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

## రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చింది : సీఎం రేవంత్ రెడ్డి

రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించామని, హైదరాబాద్‌తోనే తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య చెప్పేవారని సీఎం వెల్లడించారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం : ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చామని అన్నారు. ఆర్థికలావాదేవీల్లో సలహాల కోసం ఆర్యవైశ్యులనే అడుగుతారని, సీఎంలు ఎంతమంది మారినా ఆర్థికమంత్రిగా రోశయ్యనే ఉన్నారని, రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని కొనియాడారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలమని సూచించారు. ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరని, ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణత్యాగం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యుడేనని గుర్తు చేశారు. "ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారు. కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చాం. ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తా. ఆర్యవైశ్యుల సమస్యలు నేను పరిష్కరిస్తాను. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం. ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారు. పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారు. ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారు


## స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి



చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని గుర్తుచేశారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మంత్రివర్గం నుంచి తనను తొలగించడంపై మాట్లాడుతూ.. పదవి పోయినందుకు వ్యక్తిగతంగా ఎలాంటి బాధ లేదని, కానీ ఎందుకు తొలగించారో కారణం చెప్పకపోవడం ఆవేదన కలిగించిందని అన్నారు. మంత్రి పదవి ఒక అలంకారం మాత్రమేనని, తనకు అప్పగించిన మూడు శాఖలను ఎలాంటి అవినీతికి తావులేకుండా నడిపించానని తెలిపారు. పార్టీ మార్పు ప్రచారం నేపథ్యంలో అధిష్ఠానం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, తాను పార్టీ వీడటం లేదని వారికి స్పష్టం చేశానని సురేఖ వెల్లడించారు. ఈ క్రమంలో తన భర్త కొండా మురళికి త్వరలో పదవి ఇస్తామనే సంకేతాలు కూడా అధిష్ఠానం నుంచి వచ్చాయని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున మళ్లీ గెలిచి, మంత్రిగా తిరిగి వస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 24 నుంచి 25 డివిజన్లలో కాంగ్రెస్‌ను గెలిపించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలపై ఆమె పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కనీసం కార్పొరేటర్‌గా కూడా గెలవలేని వారు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ మరణం తర్వాత స్థానికంగా ఉన్న కొందరు "గుంటనక్కలు" తమను మోసం చేశారని ఆరోపించారు. అప్పటి మంత్రిని ఓడించేందుకే కేసీఆర్ తనకు వరంగల్ తూర్పు టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. తాము పరకాలను వీడిన తర్వాత చల్లా ధర్మారెడ్డి అక్రమంగా డబ్బు సంపాదించారని కూడా సురేఖ ఆరోపణలు చేశారు.

# బ్రిక్స్‌లో కొత్త బీమా వ్యవస్థ- పుతిన్ కీలక ప్రతిపాదన

మొదటి పేజి తరువాయి



ఢిల్లి : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బ్రిక్స్ వేదికగా కీలక ప్రతిపాదనలు చేశారు. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని మరింత పెంచే దిశగా కొత్త బీమా వ్యవస్థ, ధాన్యం మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక, భద్రతా సవాళ్లను ఎదుర్కోవాలంటే బ్రిక్స్ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పుతిన్ అన్నారు. దిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో పుతిన్ ఈ ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం ఉన్న అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, బ్రిక్స్ దేశాలు తమకంటూ స్వతంత్ర మార్గాలను ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. పెట్టుబడులు, కార్మికులు, సాంకేతికతకు సంబంధించి స్వతంత్ర మార్గాలు తమకు ఉన్నాయని, ఇతరుల ఒత్తిళ్లను ఎదుర్కొంటూనే ముందుకు సాగగలమని చెప్పారు.

### బీమా వ్యవస్థ ఎందుకు?

రష్యాపై అమెరికా సహా పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షల ప్రభావం ఆ దేశ చమురు ఎగుమతులపై పడింది. ముఖ్యంగా రష్యా నుంచి ముడి చమురును తీసుకెళ్లే నౌకలకు బీమా విషయంలో ఆంక్షలు సమస్యగా మారాయి. నిర్ణయించిన ధర పరిమితికి లోబడి కొనుగోలు చేసిన రష్యా చమురును మాత్రమే తీసుకెళ్లే నౌకలకు పాశ్చాత్య బీమా సంస్థలు సేవలు అందించే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ దేశాల మధ్య కొత్త బీమా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న రష్యా ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ వ్యవస్థ ఎలా పనిచేస్తుంది? ఏ దేశాలు ఇందులో భాగస్వామ్యం అవుతాయి? అనే విషయాలపై పుతిన్ పూర్తి వివరాలు వెల్లడించలేదు. రష్యా ప్రతిపాదనను ఇతర సభ్య దేశాలు కూడా ఉపయోగించుకోవచ్చని ఆయన చెప్పారు.

# ఏపీకి 'అల్పపీడనం' ముప్పు - నేడు ఆ జిల్లాల్లో భారీ వర్షాలు! - అప్రమత్తమైన ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని చెప్పింది. దక్షిణ కోస్తాలో ఓ మోస్తరు వానలు, రాయలసీమలో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోనసీమ జిల్లా మలికిపురంలో అత్యధికంగా 79.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరులోని శారదా కాలనీలో 50.18 మిల్లీమీటర్లు, ఎన్టీఆర్ జిల్లా గుణదలలో 49, కృష్ణా జిల్లా నందమూరులో 38.5, పోలవరం జిల్లా కూనవరంలో 32.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. తిరుమలలో భారీ వర్షం: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న వేళ తిరుమలలో భారీ వర్షం కురిసింది. తిరుమల వ్యాప్తంగా రోడ్లపై నీరు ప్రవహించింది. ఇటీవల వరుణయాగం పూర్తిచేసుకున్న అనంతరం శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ నీటి ప్రవాహంతో కనిపించాయి. భక్తులు ఆలయ సమీపంలోని వాహన మండపం, రాంభగీచ ఎదురుగా ఉన్న షెడ్లలో తలదాచుకున్నారు. కొన్ని రోజులుగా ఎండవేడిమితో ఇబ్బంది పడుతున్న భక్తులు వర్షంతో ఉపశమనం పొందారు. కోనసీమలో జోరువాన: అల్పపీడనం ప్రభావంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వర్షం దంచికొట్టింది. శనివారం జిల్లావ్యాప్తంగా సగటున 37.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంబాజీపేట ఆర్టీసీ బస్టాండ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆయుర్వేద వైద్యశాలల ముందు భారీగా వర్షపు నీరు నిలిచింది. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రం సమీపంలో అమలాపురం- రావుల పాలెం ప్రధాన రహదారిపై చెట్టు కుప్పకూలింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించారు. పొల్లూరు జలపాతం ప్రమాదకర స్థాయిలో: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. కొయ్యూరు, ముంచింగిపుట్టు, జీకే వీధి, పెదబయలు మండలాల్లో ఎడతెరిపిలేని వానలతో జనజీవనం స్తంభించింది. శనివారం కొయ్యూరులో 36.4 మిల్లీమీటర్లు, ముంచింగిపుట్టులో 28.6, జీకే వీధిలో 26.6, పెదబయలులో 19.4, చింతపల్లి 18.8, అరకులోయలో 12.2, పాడేరులో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పొల్లూరు జలపాతం ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. జలపాతం వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నీటిమునిగిన నిడదవోలు బస్టాండ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు బస్టాండ్ జలమయమైంది. చిన్నపాటి వర్షం కురిసినా బస్టాండ్‌లో నీరు నిలబడిపోతుంది. మురుగునీరుతో పాటు కలిసిపోయి ప్రాంగణంలో ప్రవహించడంతో ప్లాట్‌ఫామ్‌ల్లోకి చేరుకునేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఇదే సమస్య వేధిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఓసారి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి



కందుల దుర్గేష్ బస్టాండ్ నీట మునిగినప్పుడు పరిశీలించారు. సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించినా ఇప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బస్టాండ్‌లో వాన నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి: అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత సూచించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి విపత్తుల సంస్థ, ఆర్ టీజీఎస్ అందించే సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో రాకపోకలను నిలిపివేయాలని హోంమంత్రి దిశానిర్దేశం చేశారు.

# భారత్ పై దాడి చేయాలనే ఆలోచన వస్తే- శత్రువుల వెన్నులో వణుకు పుట్టేలా ప్రధాని మోదీ చేశారు

మొదటి పేజి తరువాయి

2014లో భారత్ 'ఫ్రాజైల్ ఫైవ్' (బలహీనమైన ఐదు దేశాలు) జాబితాలో ఉండగా, నేడు అగ్రశ్రేణి కలిగిన ఐదు దేశాల్లో ఒకటిగా నిలిచిందని తెలిపారు. నేడు ప్రపంచ దేశాలతో భారత్ కు ఉన్న రత్నాలు, ఆభరణాల వ్యాపార సంబంధాలకు దాదాపు 6,000 సంవత్సరాల నాటి సుదీర్ఘమైన చరిత్ర ఉందని షా పేర్కొన్నారు. ఆదివారం ముంబయిలో జరిగిన 52వ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న షా ఈ మేరకు ప్రసంగించారు. "ల్యాబ్ గ్రోన్ డైమండ్ల(కృత్రిమ వజ్రాలు) వ్యవస్థపై భారతీయులకు పట్టు ఉండాలి. దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సామర్థ్యాలు మన వద్ద ఉన్నాయి. పరిమాణం పరంగా చూస్తే, ల్యాబ్-గ్రోన్ డైమండ్ల మార్కెట్ ప్రస్తుత వజ్రాల మార్కెట్ కంటే దాదాపు 50 రెట్లు విస్తరించే అవకాశం ఉంది. కాబట్టి ఇది మన దేశానికి ఒక గొప్ప అవకాశం అని చెప్పవచ్చు. వీటన్నింటికీ మించి దేశాన్ని ముందుకు నడిపించేందుకు సమర్థులైన పారిశ్రామికవేత్తలు మన దేశంలో ఉన్నారు. వజ్రాలను తయారు చేసే యంత్రాల ఉత్పత్తి నుంచి, ఆభరణాల రూపకల్పన, బ్రాండ్‌లను అభివృద్ధి చేయడం, ప్రపంచవ్యాప్తంగా భారతీయ కంపెనీల షోరూమ్‌లను తెరవడం వరకు ప్రతి ఒక్క అడుగు భారతీయ హస్తాల్లోనే ఉండాలి."

– అమిత్ షా, కేంద్ర హోం మంత్రి




'డీకాలనైజేషన్ అంటే గతాన్ని తుడిచిపెట్టడం కాదు'

డీకాలనైజేషన్ అంటే కేవలం గతాన్ని తుడిచిపెట్టడం మాత్రమే కాదని, సత్యాన్ని భారతీయ కోణంలో ప్రామాణికంగా అందించడమేనని అమిత్ షా స్పష్టం చేశారు. దేశ చరిత్ర, సంప్రదాయాలు, భాషలు, పురావస్తు గ్రంథాలను కాపాడుకోవాలని, అలాగే వాటిని ప్రజల చెంతకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారు జ్ఞానాన్ని, అధికారాన్ని ఒకదానితో ఒకటి ముడిపెట్టారని, ఆ ఫ్రేమ్‌వర్క్ నుంచి జ్ఞానాన్ని విముక్తం చేయడమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యమని షా వ్యాఖ్యానించారు. ఒక దేశం ఎంత శక్తిమంతమైనదైనప్పటికీ, అది తన జ్ఞాపకాలు, చరిత్ర, సంప్రదాయాలు, సంస్కృతి, భాషల, పురాతన గ్రంథాలను కాపాడుకోవడంలో విఫలమైతే ఎక్కువ కాలం మనుగడ సాధించలేదని స్పష్టం చేశారు. ఆదివారం, ముంబయిలోని ఆసియాటిక్ సొసైటీలో 'గణేశ్ జ్ఞానార్థి' ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. "నిజమైన జ్ఞానం ఎన్నడూ ఒక సిద్ధాంతానికి బందీ కాకూడదు. దాన్ని ఏ విధంగానైనా బంధిస్తే, అసలు జ్ఞానానికున్న అర్థాన్నే మార్చినట్లు అవుతుంది. కాబట్టి జ్ఞానం, దాని ప్రకటన స్వేచ్ఛగా, నిరభ్యంతరంగా ఉండాలి. చాలా కాలంగా భారతీయ జ్ఞానాన్ని వలసవాద దృక్పథంతోనే వివరించారు. ఫలితంగా భారతీయుల్లో ఒక రకమైన ఆత్మన్యూనతా భావం ఏర్పడింది. ఆసియాటిక్ సొసైటీ వంటి సంస్థలు ఈ జ్ఞానాన్ని పరిరక్షించి దేశం, ప్రపంచ శ్రేయస్సు కోసం ఉపయోగించడానికి సహాయపడతాయి."

– అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

ఈ సందర్భంగా, బీజేపీ నాయకుడు వినయ్ సహస్రబుద్ధే నేతృత్వంలోని 'ఆసియాటిక్ సొసైటీ' నూతన కమిటీకి షా ఒక సూచన చేశారు. సంస్థ వద్ద ఉన్న విస్తారమైన సమాచార భాండాగారాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. అలాగే, భారతీయ కోణంలో చారిత్రక పరిశోధనలు సాగించేందుకు వారిని ఈ సంస్థకు ఆహ్వానించాలని సూచించారు. రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఈ సొసైటీలోని గ్రంథాలు, పత్రాలను డిజిటలైజ్ చేసి, దేశంలోని ఇతర గ్రంథాలయాలతో ఎలక్ట్రానిక్ పద్ధతిలో పంచుకోవాలని పిలుపునిచ్చారు. భారతీయ వారసత్వాన్ని పరిరక్షించే సంస్థలు, గ్రంథాలను అనుసంధానించే ఒక ఉమ్మడి వేదికను సృష్టించాలని, దానికి ఆసియాటిక్ సొసైటీ ప్రముఖ పాత్ర పోషించాలని ఆయన ప్రతిపాదించారు.

# దేశంలోనే తొలిసారిగా అమరావతిలో 'క్వాంటమ్ బయో వ్యాలీ' - ప్రకటించిన సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

శ్రీవారి ప్రసాదాన్ని బహూకరించారు. దేశంలోనే తొలిసారిగా అత్యాధునిక సాంకేతికత, జీవశాస్త్ర పరిశోధనల కలయికతో "అమరావతి క్వాంటం బయో వ్యాలీ"ని ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు, దేశ ఆరోగ్య, పరిశోధన రంగాలకు సరికొత్త దిక్సూచిగా మారనుందని సీఎం పేర్కొన్నారు. పెరిమెంటల్ బయాలజీలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ క్వాంటం బయో వ్యాలీ ప్రధాన లక్ష్యమని సీఎం వివరించారు. దీన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచ బయో ఎకానమీలో 111 మిలియన్ డాలర్ల వాటాతో ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం అగ్రశ్రేణి ఐదు రాష్ట్రాల్లో ఒకటిగా ఉందని, రాబోయే 10 ఏళ్లలో గ్లోబల్ బయోఎకానమీ పవర్ హౌస్ గా మారుతుందని చెప్పారు. విజయవాడలో క్రిటికల్ కేర్ బ్లాకులు మరియు ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు: రూ. 249 కోట్ల వ్యయంతో క్రిటికల్ కేర్ బ్లాకులు, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లాబొరేటరీల ప్రారంభంతో అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువకానున్నాయని సీఎం అన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 500 క్రిటికల్ కేర్ బెడ్లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, అల్ట్రాసౌండ్ సదుపాయాలు పాటు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ వంటి కీలక వైద్య విభాగాల్లో సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. పంచసూత్రాల రాజధానిగా అమరావతి: అమరావతి గురించి లద్దాఖ్‌లోనూ ప్రస్తావనకు వచ్చిందని సీఎం హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఎక్కడికి వెళ్లినా అమరావతి గురించే చర్చ జరిగే రోజు వస్తుందన్నారు. అమరావతిని ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా, భవిష్యత్తు, సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నో పోల్ సిటీగా, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, డీప్ టెక్నాలజీ సిటీగా రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. యువత శారీరక శ్రమతో పాటు సాంకేతిక నైపుణ్యాలను జోడించి 'స్మార్ట్ వర్క్' చేయడం ద్వారా గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని కోరారు. ఏఐ రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దేందుకు యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని సీఎం తెలిపారు. స్మార్ట్ వర్క్‌తోనే ఒత్తిడి దూరం: వంట గదినే ఫార్మసీగా, ఆహారాన్నే ఔషధంగా మార్చుకోవాలని యువతకు సీఎం సూచించారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటివి నిత్యజీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఒత్తిడిని దూరం చేసుకుని స్మార్ట్ వర్క్ చేయాలని వివరించారు. సాంప్రదాయ ఆరోగ్య పద్ధతులను పాటిస్తూనే, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా వైద్యారోగ్య రంగంలో మరింత మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య రంగానికి నిధులు కేటాయిస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు సీఎం చంద్రబాబు తెలిపారు. నడ్డా నాయకత్వంలో దేశ ప్రజల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని నాకు నమ్మకం ఉందన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు: గత 12 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందని సీఎం అన్నారు. దేశంలో వైద్యవిద్య సీట్ల సంఖ్య 51,000 నుంచి రెండింతలకు పైగా పెంచారన్నారు. కొవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిన ఘనత భారతదేశానికి, ప్రధాన మోదీకే దక్కుతుందని చంద్రబాబు అన్నారు. మంగళగిరి ఎయిమ్స్ ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. జన ఔషధి కేంద్రాల ద్వారా పేదలకు మందులు అందుతున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఫార్మా రంగానికి ఏపీ చిరునామాగా మారిందని పేర్కొన్నారు. అదేవిధంగా 'మెడ్‌టెక్ పార్క్' ద్వారా వైద్య పరికరాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామన్నారు. కేంద్ర సహకారం, రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ 1గా నిలుపుతామని సీఎం తెలిపారు. జనవరి 1 నుంచి హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్: రామాయణంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకువచ్చినట్లే, పేదల ముంగిటకే అంతర్జాతీయ వైద్య పరిజ్ఞానాన్ని సంజీవని రూపంలో తెస్తున్నామన్నార. జనవరి 1 నుంచి ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తామని తెలిపారు. వ్యాధుల ముందస్తు అంచనా, నివారణ, చికిత్స, వైద్య ఖర్చులు తగ్గించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. "ఎక్స్"లో నడ్డాకు సీఎం కృతజ్ఞతలు: అమరావతి క్వాంటం బయో వ్యాలీ ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ఇస్తామని, దేశవ్యాప్తంగా 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని అమలు చేయడంపై పరిశీలిస్తామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. "రాష్ట్రవ్యాప్తంగా 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌లను ప్రారంభించేందుకు విజయవాడలో మాతో కలిసినందుకు ధన్యవాదాలు. ప్రధాని మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ఎన్డీయే ప్రభుత్వం ఆరోగ్య, సుసంపన్న ఏపీ కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.

# బ్రిక్స్ పగ్గాలు చైనాకు- ఇకపై ఫలితాలు చూపించాల్సిందే'- బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోడీ

మొదటి పేజి తరువాయి

బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా మారుతోందని పేర్కొన్నారు.

ఫలితాలు కనిపించాలి!

బ్రిక్స్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఇకపై కాలపరిమితితో అమలు చేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. నిర్ణయాలు, ప్రకటనలు కేవలం ఫైళ్లలో ఉండిపోకూడదని, ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా వాటిని అమలు చేయాలని అన్నారు. చివరి స్థాయిలోనూ ఫలితాలు కనిపించేలా కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి కేవలం ఆలోచనలు, హామీలను మాత్రమే ఆశించడం లేదని అన్నారు. స్పష్టమైన ఫలితాలను కోరుకుంటోందని, బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, బలంగా మార్చుకోవచ్చని తెలిపారు. కీలక ఖనిజాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయని అన్నారు. ఇంధన భద్రతతో పాటు తక్కువ కాలుష్యంతో కూడిన సాంకేతికతల అభివృద్ధిలో వీటి పాత్ర కీలకమని చెప్పారు. వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూ సరఫరా వ్యవస్థలను నమ్మకంగా, వైవిధ్యంగా, స్థిరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

టెక్నాలజీ విషయంలో అందరికీ అవకాశం!

టెక్నాలజీ, కీలక ఖనిజాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం బ్రిక్స్ దేశాల ఉమ్మడి అభివృద్ధికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని మోదీ హెచ్చరించారు. సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. ఇదే సమయంలో కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఆలోచనలు, పెద్ద స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలోనూ టెక్నాలజీని మరింత సమర్థంగా ఉపయోగించుకునేలా బ్రిక్స్ నెట్‌వర్క్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ తెలిపారు. కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులను రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడమే దీని లక్ష్యమన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో బ్రిక్స్‌పై నమ్మకం పెరుగుతోందని మోదీ చెప్పారు. ఆయా దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలను గౌరవించడం, వారికోసం మాత్రమే కాకుండా వారితో కలిసి పరిష్కారాలను రూపొందించడం వల్లే ఈ నమ్మకం పెరిగిందన్నారు.

బ్రిక్స్ బలం వైవిధ్యంలోనే!

వేర్వేరు దేశాలు, వేర్వేరు పరిస్థితులు ఉన్నప్పటికీ సహకారంతో ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని ప్రధాని అన్నారు. వైవిధ్యమే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సహకారం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, ప్రతినిధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, ఆలోచనలు బ్రిక్స్ సహకారానికి

# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

## - ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు,సెప్టెంబర్ 13,అనంత సూర్య న్యూస్: వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులు,సిబ్బంది, మీడియా మిత్రులకు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుభాకాంక్షలు తెలిపారు.సెప్టెంబర్ 14న వినాయక చవితి నేపథ్యంలో ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు.ప్రజలందరూ సోదరభావం,మత సామ-రస్యంతో వినాయక చవితి వేడుకలు,నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విగ్రహాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని,రాత్రి వేళల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నిబంధనల మేరకే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు గణేష్ ఉత్సవ కమిటీలు, మత పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.అదేవిధంగా సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మవద్దని, ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. ఏదైనా అనుమానాస్పద సమాచారం కనిపిస్తే నిజానిజాలను నిర్ధారించుకునేందుకు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక పోలీసులకు, డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కర్నూలు జిల్లా ప్రజలకు ఎస్పీ



విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# స్వధర్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 111 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

రాయదుర్గం,సెప్టెంబర్ 13,అనంత సూర్య న్యూస్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, స్వధర్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో 111 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించని విధంగా మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని, అనంతరం వాటిని సహజ పద్ధతిలో నిమజ్జనం చేయాలని ట్రస్ట్ ప్రతినిధులు భక్తులకు సూచించారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా నీటి కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాయదుర్గంలోని దశ భుజ గణపతి దేవాలయానికి 11 విగ్రహాలు,స్వధర్మ సేవా ట్రస్ట్ కార్యాలయంలో 30 చిన్నపిల్లలకు కోతిగుట్ట వీధుల్లో 15 మందికి మహిళలకు మరియు ఐటిఐ కాలేజ్ మరియు జెరెస్ కాలనీ 20 మంది చిన్న పిల్లలకు, శాంతినగర్ లో




నివసిస్తున్న గుడారాల్లోని 25 మంది చిన్నపిల్లల ద్వారా వారి తల్లిదండ్రులకు 21విగ్రహాలను పంపిణీ చేశారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్,రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని,కావున మట్టి వినాయకులనే ప్రోత్సహించాలని సభ్యులు కోరారు.'భక్తి కూడా --ప్రకృతి రక్షణ కూడా' అన్న సందేశాన్ని ముగ్ధ మనోహరమైన చిన్నపిల్లల మాటల ద్వారా వారి తల్లిదండ్రుల మనసుల్లోకి తీసుకెళ్లాలనే ప్రత్యేక ఉద్దేశంతో ట్రస్ట్ ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేసింది."మట్టి వినాయకుడు -- మన సంప్రదాయానికి ప్రతీక, పర్యావరణ పరిరక్షణకు మార్గదర్శి"అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.భక్తి, సామాజిక బాధ్యత, పర్యావరణ స్పృహలకు ఈ కార్యక్రమం చక్కని ఉదాహరణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బండి యశస్వి,శ్రీరామ్ ఫౌండేషన్ ఫౌండర్ అనూష గారు మరియు స్వధర్మ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఢ ప్రో డైరెక్టర్ కలుగోడు మనోజ్ కుమార్,ట్రస్ట్ ట్రెజరర్ వై.గంగాధర్, ట్రస్టీలు వై.మహేష్,గౌస్ పీర్,ఎస్ ఎస్ సి టి రాయదుర్గం జనరల్ సెక్రెటరీ-1 ఎం. రామాంజనేయులు, జాయింట్ సెక్రెటరీ-2 మురళీకృష్ణ,ఈసీ మెంబర్లు ఎం. మహేష్,ప్రణీత, రమేష్, రామాంజి,వంశీ, ఎస్,వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గణపతి స్వామి ఆగమనం కార్యక్రమాన్ని నిర్వహించారు





అనంత సూర్య 13 అనంతపురం: హిందువుల పండుగలలో తొలి పూజలు అందుకునే మహాగణపతి పర్వదినం వినాయక చవితి పురస్కరించుకొని అనంతపురం నగరంలోని మరువకొమ్మదిన్నె కాలనీలో జనసేన పార్టీ వీర మహిళలు స్థానిక ప్రజలు పిల్లలు పెద్దలు వృద్ధుల సమిష్టిగా వినాయక చవితి ఏర్పాట్లను ముమ్మురంగా చేపట్టారు. కార్యక్రమానికి బాధ్యత చేపట్టిన జనసేన వీర మహిళ మంజుల ఆధ్వర్యంలో గణపతి మహాదేవుని ప్రతిమను సిండికేట్ నగర్ నుండి మరువ కొమ్మ కాలనీకి ఊరేగింపుగా తీసుకురాగా కాలనీలో వాసులు సంబరాలు చేసుకున్నారు. ముందుగా టపాసులు పేల్చి ముత్తైదువుల హారతి పర్యాయలతో స్వామికి ఎదురేగగా స్వామి వారి ప్రతిమను మండపం వద్దకు చేర్చారు. మహాదేవుని కుమారుడైన మహాగణపతి పర్వదినం వినాయక చవితి పురస్కరించుకొని దేశవ్యాప్తంగా హిందువులు అట్టహాసంగా నిర్వహించుకునే మహాగణపతి వినాయక చవితి పురస్కరించుకొని అనంతపురం నగరంలో జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు మిన్నంటాయి. ఐదు సంవత్సరాలుగా అట్టహాసంగా నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలు ఈ సంవత్సరం కూడా ముందస్తుగా వినాయక ఆగమనం కార్యక్రమంతో ప్రారంభించినట్లు నిర్వాహకురాలు మంజుల తెలిపారు. ఐదు రోజులపాటు నిర్వహించే వినాయక చవితిన తొలి రోజు మహాగణపతి ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు హోమాలు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలతో భజనలు సాంస్కృతి కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించినట్లు మంజుల తెలిపారు. నగరంలోని భక్తాదులందరూ మరో కొమ్మ కాలనీలో సందర్శించి దేవదేవుని ఆశీర్వచనాలు అందుకుని తమను ఆనందం చేయాలని కాలనీవాసులు పిలుపునిచ్చారు.

# జెండా పక్కనపెట్టి బహిరంగంగా తేల్చుకుందాం.. సిద్ధమా !

## - తోపుదుర్తి సోదరులకు బెడుదూరి భూపాల్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి సవాల్

అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య : ప్రకాష్‌రెడ్డీ.. మీరు ముగ్గురు, మేము ముగ్గురు అన్నదమ్ములం.. దమ్ము, ధైర్యం ఉంటే జెండా పక్కన పెట్టి బహిరంగంగా తేల్చుకుందాం.. సిద్ధమా ! అంటూ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడుదూరి భూపాల్ రెడ్డి, బెడదూరి సూర్యనారాయణ రెడ్డిలు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి సవాల్ విసిరారు. నగరంలోని సూర్యనారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డిలు వారి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 15 ఏళ్లపాటు ప్రత్యర్థులతో పోరాడి పార్టీని నిలబెట్టుకునేందుకు కృషి చేసిన కార్యకర్తలను, నాయకులను ఏనాడైనా సముచిత గౌరవం కల్పించారా.. అంటూ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ప్రశ్నించారు. తోపుదుర్తి భాస్కర్ రెడ్డి కుటుంబం



కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తమ పట్ల అగౌరవంగా మాట్లాడటమే కాకుండా కార్యకర్తలు రెచ్చగొడుతూ బాహాబాహీకి సిద్ధమయ్యారని, పరస్పరం తోసుకున్నామని ఆయన అన్నారు. కార్యకర్తలను గౌరవించే సంస్కారం లేని నీకు.. పార్టీ కార్యకర్తల పట్ల మాట్లాడే అర్హత లేదన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చూసేందుకు కార్యకర్తలంతా కట్టుబడి ఉన్నామన్నారు. ఐదు సంవత్సరాలు ఎమ్మెల్యేగా పని చేసిన తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి.. ఇప్పుడు పది మంది కూడా వెనుక నడిచే కార్యకర్తలను సంపాదించుకోలేకపోయారన్నారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోకపోతే రాబోవు రోజుల్లో అధిష్టానంతో చర్చించి రాప్తాడు నియోజకవర్గం వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్‌గా మరొకరిని నియమించాలని కోరుతామని, అంతే తప్ప పార్టీకి వ్యతిరేకంగా పని చేయమని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 28 వ వార్డుకు చెందిన 50 మంది జనసేనలో చేరిక



రాయదుర్గం,సెప్టెంబర్ 13,అనంత సూర్య న్యూస్:రాయదుర్గం పట్టణంలోని మొలకలమూరు 28వ వార్డు లోని సుమారు 50 మంది జనసేన పార్టీలో చేరారు.తాడల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రాయదుర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మంజునాథ్ గౌడ్ కొత్తగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు జనసేనలో చేరడం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంజునాథ్ గౌడ్, యశస్వి,షేక్ బాషా,గాజుల నారాయణస్వామి, గోవర్ధన్,తాడల సతీష్ కుమార్,తాడుల భాస్కర్,సికిందర్ భాషా,భూపతి,నవీన్ తదితర జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ,సెప్టెంబర్ 13,అనంత సూర్య న్యూస్:ధర్మవరం నియోజకవర్గం



తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ఆదివారం ధర్మవరం టిడిపి పార్టీ కార్యాలయంలో 87 మంది లబ్ధిదారులకు(44) లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు పరిటాల శ్రీరామ్ చేతుల మీదుగా గుట్టు నారాయణమ్మ కు గుద్దిట్టి నారాయణస్వామి నల్లగొండ సాహిత్య ముదిగుబ్బ గ్రామానికి చెందిన షాను బేగం ఫరోజ్ దంపతులకు వీరందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు.పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మనమంతా రుణపడి ఉన్నామన్నారు చెక్కులు అందుకున్న లబ్ధిదారులు నారా చంద్రబాబు నాయుడుకు పరిటాల శ్రీరామ్ కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వర్షాలు రాక ఎండిపోయిన వేరుశెనగ పంట





అమరాపురం,సెప్టెంబర్ 13,అనంత సూర్య న్యూస్: అమరాపురం మండల పరిధిలోని వీరాపురం గ్రామానికి చెందిన రైతు దేవరాజ్ తన ఒక ఎకరా పొలానికి 50 కేజీల వేరుశనగ విత్తనాలను వర్షాకాలం ప్రారంభమైన వెంటనే సమయానికి వర్షం రావడంతో వేరుశనగ విత్తనాలను విత్తుకున్నాడు. దాదాపుగా 50వేల రూపాయల దాకా ఖర్చు పెట్టుకుని పంటను సాగు చేస్తే తీరా చూస్తే వర్షం రాకపోవడంతో మధ్యలోనే తీవ్రమైన ఎండకు ఎండిపోవడంతో ఉన్న ఫలంగా పంట చేతికి అందకపోవడంతో రైతు గొర్రెలకు,ఆవులకు మేతైన దొరుకుతుందని ఆ ఉద్దేశంతో ఆయన ట్రాక్టర్లతో దున్ని వేరుశనగ చెట్లను ఏరుకొని తమ ఇండ్లకు చేర్చుకుంటున్నారు.అయితే దేవరాజ్ రైతు మాట్లాడుతూ రైతులకు నష్టమే తప్ప పంట పొలాల సాగు చేయడం వల్ల ఏమాత్రం లాభం లేదని ఆయన కన్నీటితో తన బాధను తెలియజేశాడు.ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు.రానున్న 15 రోజుల్లో నెల రోజుల లోపల వర్షం రాకపోతే త్రాగడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకని పరిస్థితి వస్తుందని రైతు దేవరాజు ఆవేదన వ్యక్తం చేస్తూ తన బాధను పాత్రికేయులతో పంచుకున్నాడు.శ్రీశైలం డ్యామ్ నుంచి అమరాపురం చెరువుకు నీళ్లను నింపితే తప్ప ఈ ప్రాంతం రైతులు పూర్తిగా ఆర్థికంగా, సామాజికంగా మరియు వక్క తోటలను పూర్తిగా పెంచుకున్న వక్క తోట ఒక్కసారిగా కళ్ళముందే ఎండిపోవడం ఖాయమని రైతు దేవరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.ఈ విధంగా సాగుచేసిన వేరుశనగ పంటను కళ్ళముందే ఎండిపోవడంతో తన బాధను చెప్పుకుంటూ ట్రాక్టర్లతో దున్ని వేరుశెనగ చెట్లను తమ ఇంటికి తీసుకో వెళ్లడం జరిగిందని రైతు దేవరాజు కన్నీటి పర్వతం అయ్యాడు.

## నియోజకవర్గ ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు



తంబళ్లపల్లి,సెప్టెంబర్13,అనంత సూర్య న్యూస్: కురబలకోట మండల ప్రజలకు జనసేన పార్టీ నాయకులు శెట్టి రాజేష్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శెట్టి రాజేష్ మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో కురబలకోట మండలంలోని ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి,ఐశ్వర్యం,మంచి ఆరోగ్యం నిండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పర్వదినాన్ని ఆనందంగా,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.వినాయక చవితి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలందరూ ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. యువత,ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణహితంగా పండుగను నిర్వహించాలని సూచించారు.



మనమంతా పర్యావరణాన్ని కాపాడుకుందాం..

వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనిల్ గౌడ్



## మట్టి వినాయక పత్రిమలను పంపిణీ చేసిన అనిల్ గౌడ్

**అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని వైసీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనిల్ గౌడ్ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా ఆదివారం నగరంలోని మొదటి రోడ్డులో గల రొద్దం సర్కిల్‌లో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్ గౌడ్ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజ సిద్ధమైన మట్టితో తయారు చేసిన గణనాథుడిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వైసీపీ నాయకులు మహేష్, భార్గవ్, సాయి, నాగేంద్ర, ఈశ్వరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### మట్టి గణనాథుడినే పూజిద్దాం..

# పర్యావరణాన్ని కాపాడుదాం

**వైసీపీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు మహమ్మద్ ఆసిఫ్**





**అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని వైసీపీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు మహమ్మద్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ఒకటవ డివిజన్ పరిధిలో మహమ్మద్ ఆసిఫ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, వైసిపి నగర అధ్యక్షులు చింత సోమశేఖర్ రెడ్డి, వైసీపీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, వైసిపి నాయకులు రాధాకృష్ణ, ఫరూక్, విక్రమ్ సాగర్, పవన్, ధన, కార్తీక్, ఆఫ్రిద్, షావలి తదితరులు హాజరయ్యారు. వినాయక చవితి సందర్భంగా రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన గణనాథుడిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి, పర్యావరణహితమైన వినాయక చవితిని నిర్వహించాలని మహమ్మద్ ఆసిఫ్ కోరారు.

### ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు,

# మొక్కలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**

పర్యావరణాన్ని మనం కాపాడుకోకపోతే ఎలి-నినో వంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్ వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఆయన మట్టి వినాయక విగ్రహాలను, మొక్కలను పంపిణీ చేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు రేపటి రామాంజనేయులుతో పాటు ఇతర నాయకులతో కలిసి ఆయన ప్రజలకు, జర్నలిస్టులకు మట్టి విగ్రహాలు మొక్కలు అందజేశారు. మీరు తీసుకున్న ప్రతి మొక్క ఒక వృక్షమై పర్యావరణాన్ని కాపాడాలని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. జర్నలిస్టులు అంటే అవేర్నెస్‌కి కేరాఫ్ అని, అలాంటి వ్యక్తులు ప్రత్యేక చొరవ తీసుకొని ఇలా మట్టి విగ్రహాలు మొక్కలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అలా చేయకపోతే భవిష్యత్తులో వచ్చే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదని, తాగునీటి సమస్య కూడా ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితులు భవిష్యత్తులో రాకూడదంటే కచ్చితంగా ప్రతి ఒక్కరు తమవంతుగా బాధ్యత తీసుకొని కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నార న్నారు. విండ్ సోలార్ పవర్ పరిశ్రమలను పెద్ద ఎత్తున తీసుకొచ్చి కార్బన్ రహిత వాతావరణం ఉండేలా చూస్తున్నారని అన్నారు. ఇటీవల రాయదుర్గంలో 10,500 కోట్లతో సుజలాన్ గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభించారన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా కలిసి వస్తేనే కాలుష్యరహిత సమాజం సాధ్యమవుతుందని దగ్గుపాటి అన్నారు. పండుగన్నది ప్రతి ఒక్కరికి మంచి చేసేలా ఉండాలని..

- నగర ప్రజలకు జర్నలిస్టులకు విగ్రహాలు మొక్కలు అందజేసిన ఎమ్మెల్యే
- ఏపీడబ్ల్యూజేఎఫ్‌ను ప్రత్యేకంగా అభినందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- పర్యావరణాన్ని కాపాడుకోకపోతే ఎల్.నినో వంటివి ఎదుర్కోవాల్సి వస్తుంది : ఎమ్మెల్యే దగ్గుపాటి
- పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- సమాజం కోసం తమవంతు బాధ్యతగా ఈ కార్యక్రమం చేపట్టామన్న రేపటి రామాంజనేయులు



అందుకే ప్రతి వినాయక చవితికి మట్టి విగ్రహాలను, మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపటి రామాంజనేయులు తెలిపారు. సమాజం కోసం తమవంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహాలు పంపిణీ జరగడం చాలా సంతోషంగా ఉందని, తాము చేపట్టిన సంకల్పం మరికొంత ముందుకు వెళ్లే విధంగా ఆయన సహకరించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

భవిష్యత్తులో కూడా తమ వంతు బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. విగ్రహాలు పంపిణీ అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపటి రామాంజనేయులుతో పాటు టిడిపి నాయకుడు ఇనయతుల్లా ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యుఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, రాష్ట్ర నాయకుడు జయప్రకాష్, బ్రాడ్కాస్టింగ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్కే సూర్య, చిన్న పత్రికల సంఘం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రచార కార్యదర్శి అమర్, టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, పట్టణ అధ్యక్షుడు కేశవ, ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర, రవి, అనిల్ కుమార్, వెటర్న్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, రామ్మూర్తి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల సమన్వయ సమావేశం



**అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**

అనంతపురం జిల్లా కేంద్రంలో కూటమి పార్టీల స్థానిక సంస్థల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల పరిశీలకులు, మాజీ మంత్రి ప్రతాపరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, బీజేపీ రాష్ట్ర నాయకులు కాపు రామచంద్రారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు జయరాం రెడ్డి, దేవరకొండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు సూచించారు.

## 16న జాబ్ మేళా..

### యువతకు ఉద్యోగావకాశాలు

**అర్హత ఉన్న ప్రతి యువతీ, యువకుడు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే దగ్గుపాటి**

**అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**



నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సెప్టెంబర్ 16న అనంతపురం నగరంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. ఏపీఎస్-ఎస్‌డీసీ, అనంతపురం జిల్లా ఉపాధి, నైపుణ్య అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రైవేట్ రంగ సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాల కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నాయని తెలిపారు. నిరుద్యోగ యువతకు వారి విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే జాబ్ మేళా ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, యూజీ, పీజీ, తదితర విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. అనంతపురం నియోజకవర్గ పరిధిలోని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్‌మేళాకు హాజరై తమకు అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను పరిశీలించి, మంచి ఉపాధి అవకాశాలను పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి జాబ్ మేళా వేదికకు చేరుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

# భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేశులు పిలుపు**



**అనంతపురం, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**

భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పునరుద్ధరించిన పలు సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వెంకటేశులు పిలుపునిచ్చారు. అనంతపురంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో నెం.6 భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. కార్మికుల వివాహం, ప్రసూతి, సాధారణ మరణం, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందించే పథకాలను ప్రతి కార్మికుడు తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి, గత సంవత్సరంలో కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసిన కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులు తమ వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పలు పథకాలను పునరుద్ధరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలకు టీఎన్‌టీయూసీ తరఫున కుంచపు వెంకటేశులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. అలాగే టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కుల రఘురామరాజు ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, వారి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారికి అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా టీఎన్‌టీయూసీ తరఫున నిరంతరం పోరాటం చేస్తామని కుంచపు వెంకటేశులు పేర్కొన్నారు. సమావేశంలో ఏపీ స్టేట్ మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్, టీఎన్‌టీయూసీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు తాడాల నాగభూషణం, ఆదినారాయణ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా డీజేల వాడకంపై

# అనంత పోలీసుల చర్యలు

**ఐదు డీజే సిస్టమ్‌లు స్వాధీనం : డీఎస్పీ చంద్రశేఖర్ వెల్లడి**



**అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 13 అనంత సూర్య :**

జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు శబ్ద కాలుష్య నియంత్రణలో భాగంగా అనంతపురం నగర పోలీసులు చట్టపరమైన చర్యలు చేపట్టారు. నిబంధనలను ధిక్కరించి అధిక శబ్దాలతో డీజే పరికరాలను ఉపయోగించిన వారిపై నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఐదు డీజే సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం అర్బన్ డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. వేడుకల్లో నిబంధనలు ఉల్లంఘించి, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తూ డీజేలు వినియోగించిన ఐదు వేర్వేరు ప్రదేశాల నుంచి డీజే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఆసుపత్రులలోని రోగులు, వయోవృద్ధులు, గుండెజబ్బు బాధితులు, చిన్న పిల్లలు, పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అధిక శబ్దాల వల్ల తీవ్ర భంగం కలుగుతోందని స్పష్టం చేశారు. నగరంలో ఏరకమైన వేడుకలైనా, ఊరేగింపులైనా డీజేలు వాడటం పూర్తిగా నిషేధమని, రాత్రి 10 గంటల తర్వాత మైకుల వాడకంపై కూడా ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఇకపై కూడా ఎవరైనా నిబంధనలు ధిక్కరిస్తే సౌండ్ పరికరాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులు, సౌండ్ సిస్టమ్ ఓనర్లను సమాన బాధ్యులను చేస్తూ కఠిన కేసులు నమోదు చేస్తామని, డీజేలతో పాటు ఆ వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నగర ప్రజలందరూ పోలీసు శాఖ చర్యలకు సహకరించాలని డీఎస్పీ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు.

# మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ : పరిటాల సునీత, శ్రీరామ్

**ప్రతి ఇంటికి మట్టి విగ్రహాన్ని అందజేత ✲ వినాయక చవితి పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్**

రామగిరి, సెప్టెంబర్ 13 అనంత సూర్య :

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తన స్వగ్రామం రామగిరి మండలం వెంకటాపురంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఇంటికి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. వెంకటాపురంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఈ మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక చవితి అంటే ఎంతో సందడిగా చేసుకునే పండుగ అని, అయితే ఇటీవల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడటం వల్ల నీటి కాలుష్యం బాగా పెరిగిందన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలన్న లక్ష్యంతోనే ఈ విగ్రహాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పండుగ అన్నది పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మట్టి వినాయక విగ్రహాలను గరికతో పూజించాలని, దీనిని ఎవరు మర్చిపోవద్దని సూచించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు వారు ప్రత్యేకంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405